క్లుప్తంగా

కృష్ణా జలాలు సరఫరా

సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ: మండల వ్యాప్తంగా కృష్ణా జలాలు నిలిచిపోవడంతో శుక్రవారం సాక్షి దినపత్రికలో 'నిలిచిన కృష్ణా జలాల సరఫరా' శీర్షికన ప్రచురించిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. శనివారం నుంచి మండల వ్యాప్తంగా కృష్ణా జలాల సరఫరాను పునః ప్రారంభించారు.

నకిరేకల్ నుంచి టీడీపీ పోటీ

నకిరేకల్ : శాసన సభ సాధారణ ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గం నుంచి టీడీపీ పోటీలో ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాకుల అంజయ్య తెలిపారు. నకిరేకల్‌లో శనివారం జరిగిన మండల, పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కూడా త్వరలో ప్రకటించబోతున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు నక్క రాంబాబేష్, అంతటి రాములుగౌడ్, పసుపులేటి కృష్ణారెడ్డి, దోనాల వెంకట్‌రెడ్డి, గాదగోని ఏడుకొండలు పాల్గొన్నారు.

రైతుబంధు పెంపుపై హర్షం

మర్రిగూడ: రైతుబంధు పథకం ద్వారా ఏడాదిలో ఎకరానికి రూ.10వేల నుంచి రూ.16వేల వరకు పెంచుతామని ప్రకటించడం హర్షణీయమని రైతుబంధు సమితి మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ అన్నారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ రైతుబంధుతో పాటు రైతుబీమా ప్రవేశపెట్టి 24గంటల నిరంతరం విద్యుత్‌ను అందిస్తూ రైతు సంక్షేమానికి బీఆర్‌ఎస్ పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ఆయన వెంట రాపోలు యాదగిరి, నరేష్ ఉన్నారు.

రూ.3లక్షలకు మించితే ఆధారాలు చూపాలి

మర్రిగూడ: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజలు ఎవరైనా రూ.3లక్షలకు మించి తీసుకెళ్తే తగిన ఆధారాలు చూపాలని స్థానిక ఎస్‌ఐ కె.రంగారెడ్డి తెలిపారు. శనివారం సరంపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇటీవల ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50వేలకు పైన ఉండి ఆధారాలు లేకపోతే సీజ్ చేయడం జరిగేదని, ప్రస్తుతం ఆ నిబంధనను రూ.3లక్షల వరకు పెంచారని తెలిపారు. ఆయన ఏఎస్‌ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి, సిబ్బంది సైదులు, రమేష్, గణేష్ ఉన్నారు.

టీబీ రహిత మండలంగా మార్చేందుకు కృషి

మర్రిగూడ: టీబీ రహిత మండలంగా మార్చేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని టీబీ, లెప్రసీ నోడల్ అధికారి జె.ప్రేమ్‌కుమార్ అన్నారు. శనివారం అజ్జలాపురం, తూర్పుతండా గ్రామాల్లో ఏసీఎఫ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైకో బాక్టీరియా ట్యుబర్క్యులోసిస్ అనే అతి సూక్ష్మ బాక్టీరియా ద్వారా దగ్గులు, తుమ్ములు గాలిలో విడుదలై ఈ వ్యాధి సోకి శ్వాసకోశ ఇబ్బందులు ఏర్పడుతాయని తెలిపారు. తగు జాగ్రత్తలు తీసుకుంటూ సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వారి వెంట ఏఎన్‌ఎంలు అరుణ, ఫైమీన్, అజయ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నివాళులర్పిస్తున్న దైద రవీందర్

కట్టంగూర్ : మండలంలోని పామనగుండ్ల గ్రామానికి చెందిన బండారు శోభన్‌బాబు(39) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శనివారం ఆ గ్రామంలో జరిగిన శోభన్‌బాబు దశదిన కర్మలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ పాల్గొని అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ గార్లపాటి రవీందర్‌రెడ్డి, కనుకుల వెంకటరెడ్డి, మాద లింగస్వామి, చెరుకు శంకర్, రంగయ్య, యాదయ్య, చంద్రయ్య ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే సహించం



ట్రాక్టర్‌లో పంచాయతీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న సామగ్రి

మునుగోడు: అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించమని మునుగోడు పంచాయతీ కార్యదర్శి మురళి హెచ్చరించారు. మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను శనివారం ఆయన అడ్డుకున్నారు. నిర్మాణ పనులకు వినియోగిస్తున్న స్టీల్‌తో పాటు సెంట్రింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకుని పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి స్థలానికి సంబంధించిన పట్టా సర్టిఫికెట్‌తో పాటు నిర్మాణ నమూనా పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి అనుమతులు ఇస్తామన్నారు.

ప్రజల చూపు.. కాంగ్రెస్ వైపు

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



నల్లగొండ : పవన్‌కుమార్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కనగల్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోమటిరెడ్డి

నల్లగొండ : బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, అందుకే ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వ్యాపార వేత్త, పద్మశాలి సంఘం నాయకుడు పున్న పవన్‌కుమార్ శనివారం ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 500మంది అనుచరులతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజలు ఆకర్షితులై పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన పవన్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, నాయకులు ఎం.డి. అఫ్జల్ ఖాన్, ఇబ్రహీం అలీ, నల్లగొండ అశోక్, సర్వర్ అలీ, బోయినపల్లి శ్రీనివాస్, అల్లి సుభాష్‌యాదవ్, దేవుని వెంకన్న, ఖమ్మంపాటి మురళి, రాములు పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేస్తాం

నల్లగొండ రూరల్ : రెండు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఆ వెంటనే రైతుల రుణాలు మాఫీ చేస్తామని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలో 80కుటుంబాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు జెడ్పీటీసీ వంగూరిలక్ష్మయ్య, మాజీ సర్పంచ్ పనస శంకర గౌడ్, జేపీ రాజు ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో యాదయ్య, అంజనేయులు, సైదులు, శ్రీనివాస్, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక

కనగల్: మండల పరిధిలోని చర్లగౌరారం, తేలకంటిగూడెం, రేగట్టె, దోరపల్లి గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు శనివారం నల్లగొండలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎంపీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనూప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ గుండెబోయిన బిక్షం యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేవిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ భారత వెంకటేశం,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కూసుకుంట్ల రాజురెడ్డి, మాజీ సర్పంచ్ చిలకరాజు వెంకటేశ్వర్లు, కేసాని వెంకటరెడ్డి,, గుండబోయిన రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం జంగారెడ్డిగూడేనికి చెందిన సర్పంచ్ తండు జానమ్మ భర్త సాయిలు, వార్డు మెంబర్ తండు సైదులు శనివారం నల్లగొండలో ఎంపీ కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో తిప్పర్తి మండల అధ్యక్షుడు జూకురి రమేష్, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఎదురెదురైన ఇరు పక్షాలు



నల్లగొండ పాతబస్తీలోని గడి మసీదు వద్ద ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎదురెదురైన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయం



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

శాలిగౌరారం : బీఆర్‌ఎస్ పాలన అంతా అవినీతిమయమని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విమర్శించారు. మండలంలోని అంబారిపేటలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీజేపీ కార్యకర్తలను ఆయన శనివారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌పార్టీ రాష్ట్రంలో దశాబ్ద కాలం పాలన సాగించి శతాబ్దకాలం అభివృద్ధిని సాధించామని గొప్పలు చెప్పుకుంటుందన్నారు. ప్రజలు ఎంతో వివేకం కలిగినవారని బీఆర్‌ఎస్ నిరంకుశ పాలనను పరిశీలిస్తున్నారన్నారు. అభివృద్ధికి పదిరెట్లు అవినీతి కూడా జరిగిందన్నారు. బీఆర్‌ఎస్‌ది మేనిఫెస్టో కాదని, అది మనీఫెస్టో అని విమర్శించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు తథ్యమన్నారు. సమావేశంలో ఆ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ పూలమ్మ, జమ్ము రమేష్, శేపూరి రవి, నవీన్ గౌడ్, మాస శ్రీనివాస్, కడియం సోమయ్య, గిరగాని యాదగిరి, తోట వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తిప్పర్తి మండలం పజ్జూరు పాఠశాలలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం పజ్జూరు ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం 2000–2001 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలకు రూ. 15 వేలు విలువ చేసే సామగ్రిని అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, పాండురంగారావు, సాంబయ్య, చల్మారెడ్డి, సోమేశ్వరరావు, సత్యనారాయణ, భిక్షంరెడ్డి, షమ్ ఉన్నీస, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



విద్యుత్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్

రామగిరి(నల్లగొండ): ప్రభుత్వ అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు అగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తిప్పర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యుత్ ఏఈకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని జొన్నలగడ్డలగూడెం సర్పంచ్ వెంకట్రామిరెడ్డి మండిపడ్డారు. యాపలగూడెంలో విద్యుత్ స్తంభం కొరత ఉందని సర్పంచ్ పిచ్చిరెడ్డి అధికారులను కోరారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ముత్తినేని శ్యాంసుందర్ మాట్లాడుతూ రామలింగాలగూడెంలో రెండు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు 25 కేవీ చోరీకి గురై రెండు సంవత్సరాలు గడుస్తోందని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పజ్జూరు సర్పంచ్ ఎస్‌కె.మోయిజ్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ నీరు రావడం లేదన్నారు. అనంతరం జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందిస్తున్న అల్పాహారం వివరాలు ప్రతి పాఠశాలలో పట్టికలో పొందుపర్చాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.విద్యుత్ లైన్‌మెన్లు ఎవరూ కూడా అందుబాటులో ఉండడం లేదన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఏనుగు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఐకాన్'లో అరుదైన బ్రెయిన్ ట్యూమర్ శస్త్ర చికిత్సలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శశాంక

నల్లగొండ టౌన్ : ఇద్దరికి క్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్ శస్త్ర చికిత్సలను మైక్రోస్కోపిక్ పద్ధతిలో విజయవంతంగా పూర్తి చేసినట్లు ఐకాన్ ఆస్పత్రి న్యూరో సర్జన్ డాక్టర్ శశాంక కోడే తెలిపారు. శనివారం స్థానిక ఐకాన్ ఆస్పత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తిప్పర్తి మండలం గడ్డికొండారం గ్రామానికి చెందిన శేఖర్, చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన సంధ్యకు మెదడుకు పెద్ద కణతులు ఉన్నాయని తెలిపారు. ఇరువురికి అధునాతన మైక్రోస్కోపిక్ పద్ధతిన శస్త్ర చికిత్స చేసి వాటిని తొలగించామని, వారు పూర్తిగా కోలుకున్నారని వివరించారు. హైదరాబాద్ వంటి నగరాల్లో మాత్రమే ఇలాంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నారని, దీనిని ఉమ్మడి జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ఐకాన్ ఆస్పత్రికే దక్కిందన్నారు. సమావేశంలో డాక్టర్ రాజేష్‌ఆలుగోలు, డాక్టర్ సాయి లావణ్య కడిమి, డాక్టర్ సాయి మౌనిక చెరుకూరి, డాక్టర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరులకు నివాళి



నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

శాలిగౌరారం: పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు స్థానిక పోలీసు సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

24న విజయదశమి శోభాయాత్ర

నల్లగొండ టౌన్ : విజయ దశమి శోభాయాత్ర ఈ నెల 24న శేర్‌బంగ్లాలోని పాత ఆర్యసమాజ్ నుంచి రామగిరి ఆర్యసమాజ్ వరకు సాగుతుందని శోభాయాత్ర నాయకుడు కేశబోయిన శంకర్‌ముదిరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత 23న నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ దసరా పండుగను 24న జరుపుకోవాలని వేద పండితులు సూచించినందున 24న శోభాయాత్రను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

చండూరుకు చేరిన ఈవీఎంలు

చండూరు : శాసనసభ సాధారణ ఎన్నికల్లో భాగంగా మునుగోడు నియోజక వర్గానికి చెందిన ఈవీఎంలు శనివారం రాత్రి చండూరు మండల కేంద్రం డాన్‌బాస్కో కళాశాల స్ట్రాంగ్‌రూంకు చేరాయి. ఇందులో 383 సీయూ (కంట్రోల్ యూనిట్స్), 383 బియూ (బ్యాలెట్ యూనిట్స్) 429వీవీ ప్యాడ్స్ ఉన్నాయి. వీటిని ఆర్‌ఓ దామోదర్ రావు సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్ర పరిచారు.ఆయన వెంట తహసీల్దారు రవీందర్ రెడ్డి, డీటీ (ఎలక్షన్) దీపక్, సీనియర్ అసిస్టెంట్ సైదులు ఉన్నారు.

నకిరేకల్‌కు చేరుకున్న ఈవీఎంలు

నకిరేకల్ : నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలు శనివారం రాత్రి నకిరేకల్‌కు చేరుకున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమక్షంలో అధికారులు భద్రపరిచి సీల్ వేశారు. జిల్లా అదనపు కలెక్టర్ ,ఆర్‌వో హేమాంత్ కేశవ్ పాటిల్ ఆధ్వర్యంలో వీటిని భద్ర పరిచారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తుర్కపల్లిలో ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షురాలు గీత, సీసీ ప్రభాకర్

కనగల్ : మండల పరిధిలోని తుర్కపల్లి, ఎం గౌరారం, పానుగోడు గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రాలను సంఘ బంధం అధ్యక్షులు, వీబీకే, సీసీలు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘంబంధం అధ్యక్షురాలు గీత, సీసీలు ప్రభాకర్, వసంత, వీబీకేలు పులకరం సుజాత, అనురాధ, లావణ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యువత అప్రమత్తంగా ఉండాలి



నార్కట్‌పల్లి ఎస్‌ఐ, సైదబాబు

నార్కట్‌పల్లి : శాసన సభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలని నార్కట్‌పల్లి ఎస్‌ఐ దొంగరి సైదబాబు సూచించారు. శనివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తమకు ఉద్యోగం రాలేదన్న నిరుత్సాహంతో ఆయా రాజకీయ పార్టీలపై సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సాధారణంగా పోలీసులు పెట్టే కేసుల కంటే ఎన్నికల సమయంలో మీద పడే కేసుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఉద్యోగాలకు సైతం దూరమయ్యే ప్రమాదముందన్నారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులకు అడ్మిన్లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సోషల్ మీడియా కామెంట్లపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు.

మీ బిడ్డగా వచ్చా .. మరోసారి ఆశీర్వదించండి

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : మీబిడ్డగా వచ్చాను .. ఐదేళ్లలో మీలో ఒకడిగా, మీ మధ్యే ఉంటూ పట్టణాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించిన .. తనను మరోసారి ఆశీర్వదించండి అని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని వివిధ వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన ఐదేళ్లలోనే నల్లగొండ పట్టణాన్ని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ మాదిరిగా అభివృద్ధి చేశానని తెలిపారు. గత పాలకులు నల్లగొండను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశారని, తాను సీఎం దగ్గర రూ. 1300 కోట్లు తీసుకువచ్చి రాష్ట్రంలోనే మోడల్ పట్టణంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మారగోని భవాని గణేష్, ఎడ్ల శ్రీనివాస్, నాయకులు చిన్నబత్తుల జయప్రకాశ్, అంజిబాబు, నిమ్మనగోటి కృష్ణయ్య పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

- మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం



నేరడలో ర్యాలీగా వెళ్తున్న వేముల వీరేశం

చిట్యాల: రాష్ట్ర ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చిట్యాల మండలం నేరడ గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీ పథకాలను ఇంటింటికీ వెళ్లి పార్టీ నాయకులు, కార్యకర్తలు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, గ్రామ సర్పంచ్ దుబ్బాక శోభా వెంకట్‌రెడ్డి, దుబ్బాక అమరేందర్‌రెడ్డి, గుడిపాటి లక్ష్మీనర్సింహ, జడల చినమల్లయ్య, దుబ్బాక రజనీకాంత్‌రెడ్డి, చిర్రబోయిన కృష్ణయ్య, సముద్రాల శంకర్, అద్దెల లింగారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

శాలిగౌరారం: సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని శాలిలింగోటంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ బూత్ ఇంచార్జీల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ప్రజలు వాస్తవాన్ని గమనించి తమ విలువైన ఓటును బీఆర్‌ఎస్‌పార్టీకి వేసి మరింత అభివృద్ధిని సాధించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం భైరవునిబండ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, ఎంపీపీ గంట లక్ష్మమ్మ, మామిడి తేజస్వీ, తాళ్లూరి మురళి, వైస్‌ఎంపీపీ కందుల అనితారెడ్డి, గుండా శ్రీనివాసులు, కంబాలపల్లి కృష్ణ, కట్ట వెంకట్‌రెడ్డి, చాడ హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కే ప్రజల ఆశీర్వాదం : ఎమ్మెల్యే చిరుమర్తి



కేతేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లింగయ్య

కేతేపల్లి: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కే ప్రజల ఆశీర్వాదం ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. రాష్ట్రంలో మూడవసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కేతేపల్లిలో నిర్వహించిన రోడ్‌షోలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్‌తో కలసి ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. సీఎం కేసీఆర్ మరోసారి ప్రజల కోసం అద్భుతమైన మేనిఫెస్టోను ప్రకటించారని చెప్పారు. గత ఐదేళ్లలో నకిరేకల్ నియోజకవర్గంలో అభివృద్ధికి వందల కోట్ల రూపాయలు తీసుకువచ్చానని, ఈ ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అంతకుముందు మండలంలోని కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద స్వాగతం పలికిన టీఆర్‌ఎస్ నాయకులు బైక్‌లపై కేతేపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కేతేపల్లి జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న, మహిళా మండల అధ్యక్షురాలు ఎ.విజయరాణి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చిరుమర్తి ఎన్నికల ప్రచారం

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య మార్నింగ్ వాక్‌లో భాగంగా శనివారం ఉదయం స్థానిక మినీ స్టేడియంలో పాదాచారులను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీ బాలత్రిపుర సుందరి దేవిగా అమ్మవారు



చిట్యాల: ఆరెగూడెంలో పూజలు చేస్తున్న భక్తులు

చిట్యాల: మండలంలోని ఆరెగూడెం గ్రామంలో దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన శ్రీ దుర్గా మాతా విగ్రహం ఎదుట శనివారం భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో గురుస్వామి వల్లందాసు సంతోష్, మురాల మహేష్, పేర్క రాకేష్, నంద్యాల వినయ్‌కుమార్, సిందే వంశి, జోగు నాగరాజు, మోటె నితిన్ పాల్గొన్నారు.



మునుగోడులో పూజలు చేస్తున్న జెడ్పీటీసీ

దుర్గాదేవి నవరాత్రి పూజలు

మునుగోడు: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మునుగోడు మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాల వద్ద భక్తులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు మండపాల వద్ద అన్నదానాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నారబోయిన స్వరూరాణి రవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు మహిళల విజయం గొప్పది



మాట్లాడుతూన్న ధనంజయగౌడ్

చండూరు : తమిళనాడులోని వాచాతి గ్రామ ప్రజలపై అఘాయిత్యాలకు పాల్పడిన నేరస్తులపై అక్కడి మహిళలు అలుపెరుగని పోరాటం చేసి సాధించిన విజయం గొప్పదని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్ అన్నారు. శనివారం చండూరు మండల పరిధిలోని నేర్మట గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరస్తులైన పోలీసులు అటవీ, రెవెన్యూ అధికారులను చెన్నై హైకోర్టు శిక్షించిందని తెలిపారు.సమావేశంలో సంఘం నాయకులు బురుకల అంజయ్య, బురకల నగేష్, అంజి,స్వామి, యాదయ్య, సైదులు, నరసింహ ఉన్నారు.

పులిచర్ల మండలం ఏర్పాటు చేయాలని మంత్రులకు వినతి

పెద్దవూర : మండలంలోని పులిచర్ల గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావులకు హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మండల సాధన సమితి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దేవసాని శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెద్దవూర, పీఏపల్లి మండలాలకు చెందిన 12 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అఖిల పక్ష నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. మండలానికి కావాల్సిన అన్ని మౌలిక వసతులు పులిచర్ల గ్రామంలో ఉన్నాయని పేర్కొన్నారు. పులిచర్లను మండలంగా ఏర్పాటు చేయాలని పెద్దవూర, పీఏపల్లి మండలాలకు చెందిన 13 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా తీర్మాణం చేశాయని, 289 రోజులుగా ఇదే విషయాన్ని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి విన్నవించామని పేర్కొన్నారు. పులిచర్లను మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని, తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.